క్లుప్తంగా

దర్గా ముస్తాబు

చెన్నూర్: చెన్నూర్ జామా మసీదు వెనుకల గల హజరత్ సయ్యద్ షా బాబా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఉర్స్ ఉత్సవ సమితి అధ్యక్షుడు నవాజోద్దిన్ తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా గురువారం దర్గా ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ మురళికృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా నవాజోద్దిన్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా ఈ నెల 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు ఉర్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉర్సు ఉత్సవ సమితి సభ్యులు అఖిల్, యాసిన్ పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం



భోజనం చేస్తున్న ఎంపీడీవో, ఎస్సై

భీమిని: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంపీడీవో గంగామోహన్ అన్నారు. భీమిని మండలంలోని చిన్నతిమ్మాపూర్ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎంపీడీవో గంగామోహన్, ఎస్సై విజయ్‌కుమార్ మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

క్రికెట్ బ్యాట్లు అందజేత



బ్యాట్లు అందజేస్తున్న శ్వేత, అశోక్

భీమారం: గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం ద్వారా కాజీపల్లికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు గురువారం ఎస్సై శ్వేత, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ కలిసి క్రికెట్ బ్యాట్లు పంపిణీ చేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు.

దుప్పట్లు పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక బీసీ పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహంలో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తంనాయక్ విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిందని, నూతన మెనూ అమలు చేస్తూ విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తుందన్నారు. జిల్లా రవాణా అధికారి సంతోష్ రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. వసతీ గృహ విద్యార్థులకు వేడి నీటి కోసం రెండు గీజర్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఏబీసీడబ్ల్యూవో భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనం సిద్ధం!

- చివరి దశకు పనులు
- ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభానికి చర్యలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం సిద్ధమవుతోంది. 50 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడం, రోగులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నూతన ఆస్పత్రి భవనం నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. 2023, ఏప్రిల్‌లో రూ.8.50 కోట్లతో అప్పటిమంత్రి హరీశ్‌రావు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం చివరిదశకు చేరాయి. రెండు అంతస్తులతో 20 గదులు నిర్మాణంతోపాటు ఓటీ, క్యాజు వాలిటీ గది, మేల్ వార్డు, ఫీమేల్ వార్డు, లేబర్ రూంతోపాటు భవనానికి రంగులు వేయడం పూర్తయింది. ప్రస్తుతం ప్రహరీ, పైప్‌లైన్ల పనులు కొనసాగుతున్నాయి. గణతంత్ర వేడుకల రోజు భవనం ప్రారంభానికి అధికారులు నిర్ణయించారు. పనులు పూర్తికాకపోవడంతో ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



ప్రారంభానికి సిద్ధమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనం

శిథిలావస్థకు భవనం

సుమారు 50 ఏళ్ల క్రితం నాటి ప్రభుత్వ ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల ప్రజలు, రోగులకు వైద్యసేవలందించేందుకు పాత ఎంపీడీవో కార్యాలయంలో ఆస్పత్రి కొనసాగుతోంది. వైద్యసిబ్బంది వారికి చికిత్స అందిస్తున్నారు.

నిధులు లేక నిలిచిన మార్చురీ పనులు

మార్చురీ గది కోసం అధికారులు ఆస్పత్రి పక్కనే ఉన్న మున్సిపల్ కార్యాలయ స్థలాన్ని కేటాయించారు. మున్సిపల్ కార్యాలయాన్ని పాత ఎంపీడీవో కార్యాలయానికి తరలించేందుకు సన్నాహాలు చేశారు. అధికారులు ఇప్పటివరకు పోస్టుమార్టం గది నిర్మాణంతోపాటు పార్కింగ్, జనరేటర్ ఏ ర్పాటు చేయలేదు. నిధులు లేకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని పనులను వెంటనే పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తిచేయాలి



ప్రభుత్వ ఆస్పత్రి భవనం పనులు చివరి దశకు చేరాయి. మార్చురీ గదితోపాటు ఇతర పనులను అధికారులు ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి. పనులు త్వరగా పూర్తి చేసి వెంటనే ప్రారంభించాలి.

– శ్రీనివాస్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటిండెంట్, లక్సెట్టిపేట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- డీఆర్డీవో కిషన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. మండలంలోని హాజీపూర్, గుడిపేట, వేంపల్లి, రాపల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. వేంపల్లిలో జరిగిన గ్రామసభలో డీఆర్డీవో కిషన్ పాల్గొని మాట్లాడారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక నిరంతరం సాగుతుందన్నారు. గ్రామసభల్లో తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో ఉమర్‌షరీఫ్, ఏవో కృష్ణ, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, టీఏలు, ఎఫ్ఏలు, ప్రజలు పాల్గొన్నారు. 24న ముల్కల్ల, టీకానపల్లి గ్రామాల్లో గ్రామసభలు జరగనున్నాయి.

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట, లింగాపూర్, మామిడిపల్లి, మేదరిపేట, దండేపల్లి, పెద్దపేట, లక్ష్మీకాంతపూర్, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్, నంబాలలో గ్రామసభలు నిర్వహించారు. అర్హులై ఉండి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. రేషన్‌కార్డుల దరఖాస్తులు నిరంతర ప్రక్రియ అని ఎంపీడీవో ప్రసాద్ చెప్పారు. తహసీల్దార్ సంధ్యారాణి, డీటీ విజయ, ఏవో అంజిత్, ఆర్ఐ భూమన్న, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భీమిని: మండలంలోని చిన్నతిమ్మాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు గురువారం నిర్వహించారు.కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, పలు శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



వేంపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

వేమనపల్లి: మండలంలోని నీల్వాయిలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. అర్హత పొందిన లబ్ధిదారుల వివరాలను కార్యదర్శి అశోక్, ఏపీవో సత్యప్రసాద్ చదివి వినిపించారు.

భీమారం: మండలంలోని 11గ్రామపంచాయతీల్లో 21, 22 తేదీల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో మొత్తం 542దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలకు దరఖాస్తు చేసుకున్నా, వార్డు సభల్లో పేర్లు రాని వారు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి మరోసారి దరఖాస్తు చేసుకుంటున్నారు. వార్డు సభల్లో ఇవ్వడంతో పాటు, కార్యాలయానికి ప్రజలు వస్తుండడంతో, మున్సిపల్ అధికారులు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

వార్డు సభల్లో దరఖాస్తుల వెల్లువ

మందమర్రిరూరల్: మున్సిపాలిటి పరిధిలోని 13నుంచి 24వార్డుల్లో ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రాజేశ్వర్ హాజరయ్యారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

భీమారం/బెల్లంపల్లి/తాండూర్/మంచిర్యాలటౌన్/: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో, భీమారం నర్సింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో, బెల్లంపల్లిలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఆధ్వర్యంలో, తాండూర్ మండలంలో బీజేవైఎం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బోస్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. స్వాతంత్ర్యోద్యమంలో సుభాష్ చంద్రబోస్ నిర్వహించిన పాత్రను పలువురు గుర్తు చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర సభ్యుడు నాతరి స్వామి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎలిగేటి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు వంగల చక్రపాణి, భీమారంలో ఎల్ఐసీ అడ్వైజర్ రేషవేని శ్రీనివాస్, ఇన్‌చార్జి హెడ్మాస్టర్ ప్రమీలా, జిల్లా కేంద్రంలో యోగ గురువు శ్రీనివాస్, ఫిట్‌నెస్ సెంటర్ అధ్యక్షుడు దాసరి కుమార్, తులా ఆంజనేయులు, చంద్రకాంత్, మహేందర్ రెడ్డి, సురేశ్, లక్ష్మణ్, సుభాష్, తోట వెంకన్న, అచ్చిబాబు, తాండూర్‌లో సీఐ కుమార స్వామి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమారంలో నివాళులర్పిస్తూ...

అర్థమయ్యేలా బోధించాలి

కాసిపేట: బోధనోపకరణాలు ఉపయోగించి విషయానుగుణంగా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం సాంబమూర్తి సూచించారు. మండల కేంద్రంలోని కాసిపేట జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు స్కూల్‌కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.

రేపు జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రం ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 25న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పే టీ ఎం కంపెనీలో సేల్స్ ఎక్జిక్యూటివ్(50) పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు 18–35 ఏళ్ల లోపు, ఎస్సెస్సీ/ఇంటర్ పాసై, స్మార్ట్‌ఫోన్, బైక్ కలిగి ఉన్నవారు హాజరు కావచ్చన్నారు.

క్రైం కార్నర్..

ఇంట్లో చోరీ

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటకు చెందిన మోటపల్కుల గురువయ్య ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గురువయ్యకు ముత్యంపేటతో పాటు, లక్సెట్టిపేటలో ఓ ఇల్లు ఉంది. ఈ నెల 19న ముత్యంపేట నుంచి లక్సెట్టిపేట ఇంటికి వెళ్లి అక్కడే ఉన్నారు. పనిమనిషి శంకరయ్య 23న ముత్యంపేటలోని ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని గురువయ్యకు తెలిపారు. తను వచ్చి చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. 24గ్రాముల బంగారు నెక్లెస్, రూ.50వేల నగదు కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

గొడవకు కారణమైన నిందితుల అరెస్ట్

దండేపల్లి: భార్యాభర్తల పంచాయితీలో గొడవకు కారకులైన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు లక్సెట్టిపేట సీఐ నరేందర్ తెలిపారు. దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఉదయ్‌కిరణ్‌తో కలిసి గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని వెల్గనూర్‌కు చెందిన చుంచు లక్ష్మీనారాయణ కూతురు తిరుమలకు, దొనూర్‌కు చెందిన కమలాకర్‌తో 2011లో వివాహం అయ్యింది. పిల్లలు పుట్టడం లేదని భార్యాభర్తల మధ్య రెండేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 22న దండేపల్లి పీఏసీఎస్ కార్యాలయ సమీపంలో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. పంచాయతీ పది రోజులకు వాయిదాపడటంతో, చుంచు లక్ష్మీనారాయణ (తిరుమల తండ్రి) ప్రోద్బలంతో చుంచు జగదీష్, రాకేష్, కన్నూరి తేజ, దహేగామ లక్ష్మీనారాయణ, పైడిపెల్లి రాజ్‌కుమార్‌లతో పాటు మరికొంత మంది వ్యక్తులు కమలాకర్(తిరుమల భర్త) తరుపున బంధువులపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై కేసునమోదు చేసి నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. మిగితా వారికోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నిందితులు వినియోగించిన రెండు కార్లు కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

ఒకరికి ఏడాది జైలుశిక్ష

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్ సమీపంలో 2019 అగష్టు 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఏడాది పాటు సాధారణ జైలుశిక్ష విధిస్తూ గురువారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కే.నిరోష తీర్పును వెల్లడించినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. 2019 అగష్టు 10న రాత్రి 10:30కు మందమర్రి మండలం బీ జోన్‌కు చెందిన వెలగపూడి శివరామకృష్ణ(60), తన మనవరాలు నివేధితను రైల్వేస్టేషన్ నుంచి బైక్‌పై ఎక్కించుకొని తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో శ్రీనివాసగార్డెన్ వద్ద రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ (ట్యాంకర్) శివరామకృష్ణ బైక్‌కు అతివేగంగా ఢీకొట్టింది. ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. నివేధితకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్‌పై నివేధిత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు వెస్ట్ బెంగాల్‌కు చెందిన సంజయ్ సర్కార్(లారీ డ్రైవర్)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో విచారించగా, నేరం రుజువైనందునా సంజయ్ సర్కార్‌కు ఏడాది పాటు సాధారణ జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

‘శివకాంత్‌ను విధుల్లోకి తీసుకోవాలి’



మాట్లాడుతున్న సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: ఎంతో కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడిని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా సివిల్ సూపర్‌వైజర్ వేధింపులకు గురి చేస్తున్నారని సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. శ్రీరాంపూర్ సివిల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న శివకాంత్ కాంట్రాక్ట్ కార్మికుడు అనారోగ్య కారణాల వల్ల నెల రోజులు డ్యూటీలకు రాలేదన్నారు. ఆరోగ్యం బాగయ్యాక డ్యూటీకి వస్తే, సంబంధిత సూపర్‌వైజర్ గంగారాం డ్యూటీలకు తీసుకోకుండా వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఎందుకని అడిగితే సంబంధిత కాంట్రాక్టర్‌తో చెప్పించాలన్నారు. కాంట్రాక్టర్ తీసుకోమని చెప్పినా కూడా వినిపించుకోలేదన్నారు. చివరికి ఉన్నతాధికారులను కలిస్తే వారు కూడా సమ్మతించారన్నారు. ఐనా తీసుకోకుండా దురుద్దేశ్యంతో కార్మికున్ని తిప్పించుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గురువారం కూడా శివకాంత్ శ్రీరాంపూర్‌లోని సివిల్ కార్యాలయానికి వచ్చి మరోసారి సూపర్‌వైజర్‌ను బ్రతిమిలాడినా వినిపించుకోలేదని, దీంతో తీవ్ర మనోవేదనతో సెల్‌ఫోన్ ఆఫీసులోనే పడేసి ఎవరికీ చెప్పకుండా ఉదయం అదృశ్యం అయ్యాడని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్ట్ కార్మికుడిని తక్షణమే డ్యూటీలకు తీసుకొని వేధింపులకు గురిచేసిన సూపర్‌వైజర్ గంగారాంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు ప్రభాకర్, సురేంద్రచారి, అనిల్‌కుమార్, శ్రీనివాస్, రాజేందర్, సతీశ్, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో ఆచూక.

సివిల్ కార్యాలయం నుంచి అదృశ్యమైన శివకాంత్ సాయంత్రం వరకు ఎవరికీ అందుబాటులోకి రాలేదు. కుటుంబ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులు శ్రీరాంపూర్ పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. చివరికి పోలీసులు, తోటి కార్మికులు అతడి ఆచూకి కోసం వెతుకగా గోదావరిఖనిలో దొరికాడు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ విషయమై సూపర్‌వైజర్ గంగారాంను వివరణ కోసం ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి వాహనాలు నడుపాలని మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6 గనిలో గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. బైక్‌లపై డ్యూటీకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోర్ వీలర్‌లో వెళ్తే సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. గనిలో ఏ విధంగా రక్షణగా పని చేస్తారో, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు కూడా అంతే జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, అడిషనల్ మేనేజర్ మర్రి కొమురయ్య, సర్వే అధికారి ఎస్పీ వర్మ, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సురేందర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, ఫిట్ సెక్రెటరీ సంఘం సదానందం, నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై గురువారం గైర్హాజరు కార్మికులకు అధికారులు, కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గని మేనేజర్ భూశంకరయ్య మాట్లాడుతూ.. నెలకు అండర్‌గ్రౌండ్ కార్మికులు 16మస్టర్లు, సర్ఫేస్ కార్మికులు 20మస్టర్లకు తక్కువ చేసిన వారికి ఉదయం మేనేజర్ కార్యాలయంలో, మధ్యాహ్నం క్యాంటిన్ హాల్లో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 65మంది కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ అభివృద్ధి, ఉత్పత్తి దృష్ట్యా ముందు గైర్హాజరు కాకుండా డ్యూటీలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి నిఖిల్ అయ్యార్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, గని ఫిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మినారాయణ, సంక్షేమాధికారి జీశాన్, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సింగరేణికి పేరు తేవాలి

శ్రీరాంపూర్: మంచి ర్యాంకులు సాధించి సింగరేణికి పేరు తేవాలని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ గుండా శ్రీనివాస్ తెలిపారు. సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీని గురువారం ఆయన సందర్శించారు. సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందన్నారు. సింగరేణి అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బాలికల వసతి గృహంలో నేతాజీ సుభాష్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, ఏరియా హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్ రెడ్డి, శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి ఎల్లందు క్లబ్ ఆవరణలో గురువారం లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం దేవేందర్ సతీమణి, లేడీస్‌క్లబ్ ఏరియా అధ్యక్షురాలు స్వరూపరాణి హాజరై ప్రారంభించారు. ఆటల పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.



బొగ్గుబాయి వార్తలు

ఐఎన్టీయూసీ ఏరియా కార్యదర్శిగా వీరమల్లు

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శిగా దండే వీరమల్లును ఎన్నుకున్నారు. ఈ మేరకు గురువారం ఎస్ఆర్పీ 3 గనిలో జరిగిన ఫిట్ కమిటీ సమావేశంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో వీరమల్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గని ఫిట్ కార్యదర్శిగా రిక్కుల గోపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా చల్లంగి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ నాయకులను గ్రూప్ ఏజెంట్, మేనేజర్‌లకు పరిచయం చేయించి కమిటీ పేర్లు సమర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, మైనింగ్ స్టాఫ్ కేంద్ర ఇన్‌చార్జీ తిరుపతి రాజు, కార్యదర్శి మారుపల్లి బాపు, నాయకులు పాల్గొన్నారు.

యూనిఫాం ఇవ్వాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఇటీవల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటివరకు యూనిఫాం ఇవ్వలేదని ఆరోపించారు. కాంట్రాక్టర్ వద్ద నుంచి యూనిఫాం ఇప్పించడంలో యాజమాన్యం చొరువ చూపాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏరియాలోని సింగరేణి హైస్కూల్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడా రు. మరో రెండు రోజుల్లో గణతంత్ర దినోత్సవం రానుందని సెక్యూరిటీ గార్డులకు యూనిఫాం అందించి, పరేడ్ చేయించాలని యాజమాన్యాన్ని కోరారు.

సంక్షిప్త వార్తలు

కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

తాండూర్: నేతకాని సంఘం మండల అధ్యక్షుడు గొర్లపల్లి విజయ్‌ని కులం పేరుతో దూషించిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆ సంఘం తాండూర్ మండల నాయకులు డిమాండ్ చేశారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అతడిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందని తెలిపారు.

‘మాలల జోలికి వస్తే ఊరుకోం’

చెన్నూర్: ఎస్సీ వర్గీకరణ అనే అంశం సున్నితమైందని, సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా, వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన విషయం తెలుసుకోకుండా గోనే ప్రకాశ్‌రావు వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మాల మహానాడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోనే ప్రకాశ్‌రావు ఎమ్మార్పీఎస్‌కు మద్దతు తెలిపితే నష్టం లేదని, ఎమ్మెల్యే వివేక్ కుటుంబంపై, మాల సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు.

కంటి ఆపరేషన్లు

చెన్నూర్: పట్టణంలో బండారి రాజేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు. వేమనపల్లి మండలంలోని కల్లెంపల్లి గ్రామానికి చెందిన పది మంది నిరుపేదలకు గురువారం కంటి ఆపరేషన్లు చేసినట్లు వైద్యులు అభిషేక్ బృందం తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వరి చారిట్రబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కరెంటు మోటార్ల దొంగతనం అరికట్టాలి

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి శివారులోని పొలాల్లో కరెంటు మోటార్ల దొంగతనం అరికట్టాలని గురువారం స్టేషన్ పెద్దనపల్లికి చెందిన రైతు కుందేళ్ల సంజీవ్ కోరారు. ఈ నెల 7న రాత్రి 5హెచ్‌పీ, 3హెచ్‌పీ మోటార్లు దొంగతనానికి గురైనట్లు వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. రైతుల బాధను అర్థం చేసుకొని దొంగతనాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు.

బడిబయటి పిల్లల గుర్తింపు సర్వే

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, కన్నెపల్లి క్లస్టర్ల పరిధిలో రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీ)లు ముడిమడుగుల నారాయణ, స్వామి గురువారం బడిబయటి పిల్లల సర్వే నిర్వహించారు. బడి మానేసి ఇంటి వద్ద ఉన్న పిల్లలను గుర్తించి సమీప స్కూళ్లలో చేర్పించారు. అనంతరం వివరాలను ప్రభంద పోర్టల్ నమోదు చేశారు.

ఆర్థికసాయం

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన సుద్దాల రాములు, జిల్లపెల్లి శ్రీనివాస్, మర్సుకోల చందు, జూల లక్ష్మయ్య వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం పంపించగా, వాటిని ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దం త్రిమూర్తి గురువారం బాధిత కుటుంబాలకు అందించారు.

భూమిపూజ

వేమనపల్లి: మండలంలోని ముల్కలపేట ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో మంచి నీటి బోర్ల ఏర్పాటు కోసం గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, మాజీ వైస్ ఎంపీపీ ఒడిశ్ల రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

నియామకం

కాసిపేట: మున్నూర్‌కాపు సంఘం మండలాధ్యక్షుడిగా దేవాపూర్‌కు చెందిన అట్టెపల్లి శ్రీనివాస్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాల సందర్శన

భీమారం: విద్యార్థులకు అర్థం అయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఎంపీడీవో మధుసూదన్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంపీవో సతీష్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు.